## క్లుప్తంగా

### నివాళులర్పించిన ఎమ్మెల్యే వివేక్



ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం ముల్కనూరు గ్రామానికి చెందిన ముష్క రవి కొంతకాలంగా చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వద్ద గన్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. రవి తల్లి లచ్చమ్మ (వంటలక్క) అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వివేక్ మంగళవారం ముల్కనూరుకు చెరుకొని లచ్చమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం లచ్చమ్మ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆయన వెంట నాయకులు అయిలయ్య, అశోక్‌ముఖర్జీ, రమేశ్ తదితరులు ఉన్నారు.

### మాజీ ఎమ్మెల్యే పరామర్శ



పరకాల : అనారోగ్యంతో మృతిచెందిన బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబ సభ్యులను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మంగళవారం పరామర్శించారు. మాదారం పీఏసీఎస్ చైర్మన్ నల్లెల లింగమూర్తి తండ్రి రాజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ధర్మారెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

### సీఐని కలిసిన సీపీఐ నాయకులు

మడికొండ: కాజీపేట మండలం మడికొండ పోలీస్‌స్టేషన్‌కు నూతనంగా వచ్చిన ఎస్‌హెచ్ఓ పుల్యాల కిషన్‌ను మంగళవారం మడికొండకు చెందిన సీపీఐ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కలిసిన వారిలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు మునిగాల భిక్షపతి, మాలోతు శంకర్, కొట్టపాక రవి, మంద సుమన్ కలిసి శాలువా, పూల బొకేతో శుభాకాంక్షలు తెలిపారు.

### బీజేపీ నేతకు సన్మానం

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్‌లో మంగళవారం బీజేపీ నాయకుడికి రైల్వే నాయకులు ఘనంగా సన్మానించారు. ఇటీవల 46వ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నికైన పిట్టల రమేశ్ ముదిరాజ్‌ను రైల్వే నాయకులు పాశం దేవయ్య, బాల్య రవీందర్, దుర్గప్రసాద్, అరుణ్‌లు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.

### పోచమ్మ బోనాలకు రండి

హన్మకొండ చౌరస్తా : హనుమకొండ న్యూశాయంపేటలో ఈనెల 29న నిర్వహించే పోచమ్మ బోనాల మహోత్సవాలకు రావాలంటూ 31వ డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజు మంగళవారం పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, వరంగల్ ఎంపీ కడియం కావ్యను వారి నివాసాల్లో వేర్వేరుగా కలిసి ఆహ్వానపత్రికలను అందజేశారు. ప్రతిఏటా శ్రావణమాసం చివరి గురువారం పోచమ్మతల్లికి బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తుందని తెలిపారు.

### తమలపాకులతో అలంకరణ

కాజీపేట: 63వ డివిజన్ జూబ్లీమార్కెట్ ఆవరణలో కొలువుదీరిన దక్షిణ ముఖ అభయాంజనేయస్వామికి మంగళవారం తమలపాకులతో ఆలయ ప్రధాన అర్చకులు జాగర్లపూడి శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి నిత్య పూజలను జరిపించారు. భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన మల్లెలు, తమలపాకులతో స్వామి వారిని అలంకరించారు.

### మంజులకు ఎన్టీఆర్ అవార్డు

హన్మకొండ చౌరస్తా: వరంగల్‌లోని ఎల్‌బీ కళాశాల అధ్యాపకురాలు, చిత్రకారిణి హనుమకొండ గోపాల్‌పూర్‌కు చెందిన సాగంటి మంజులను మదర్‌థెరిస్సా సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జాతీయ అవార్డుతో సత్కరించారు. విజయవాడలో సోమవారం జరిగిన మదర్ థెరిస్సా సర్వీస్ సొసైటీ రెండో వార్షికోత్సవ వేడకల్లో తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ వివిధ రంగాల్లో సేవలందించిన వారిని అవార్డుతో సత్కరించారు. సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ప్రసాద్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఆర్టిస్టులు, కళాశాల అధ్యాపకులు మంజులను అభినందించారు.

### గణపతి నవరాత్రి ఉత్సవ కమిటీ ఎన్నిక

హన్మకొండ: హనుమకొండ శ్యామల దుర్గాదాస్ కాలనీలో గణపతి నవరాత్రి ఉత్సవ కమిటీని కాలనీపార్కులో మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నల్లాని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా గూడూరు రవీందర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా తంగెళ్లపల్లి శంకరాచారి, కోశాధికారిగా రాంపెల్లి రాజప్రభూ, కార్యవర్గ సభ్యులుగా కటకం శివప్రసాద్, ఓదెల రమేశ్, రొయ్యల సత్యనారాయణ, చెన్నూరి బాపు రావు, సిద్ధారెడ్డిని ఎన్నుకున్నారు.

# సఖి సేవలను వినియోగించుకోవాలి

- కేస్ వర్కర్ హరిత
- నందనం గ్రామంలో అవగాహన సదస్సు
- బాధిత మహిళలకు అండగా ఉంటామని భరోసా



సఖి సేవలపై అవగాహన్న కల్పిస్తున్న హరిత, కరుణ

ఐనవోలు : సఖి–వన్‌స్టాప్ సెంటర్ సేవలను బాధిత మహిళలు వినియోగించుకోవాలని కేస్ వర్కర్ హరిత అన్నారు. మంగళవారం మండలంలోని నందనం గ్రామంలో సీసీ మోహన్‌రావు సమక్షంలో సఖి–వన్ స్టాప్ సెంటర్ సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హరిత, పారామెడికల్ కరుణ మాట్లాడారు. సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్, మహిళ అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సఖి వన్‌స్టాప్ సెంటర్ కొనసాగుతుందని అన్నారు. మహిళలు చట్టాలను ఎలా వినియోగించుకోవాలో వివరించారు. విడిపోయే భార్యాభర్తలకు సఖి సెంటర్‌లో కౌన్సెలింగ్ నిర్వహించి కలిపే ప్రయత్నం చేయనున్నట్లు తెలిపారు. అలాగే వరకట్న వేధింపులు, లైంగిక వేధింపులు, గర్భవిచ్ఛిత్తితో పాటు వివిధ వేధింపులకు గురవుతున్న మహిళలకు సఖి కేంద్రం అండగా నిలుస్తోందని అన్నారు. బాధితులకు న్యాయ, పోలీస్, వైద్య, తాత్కాలిక వసతిని సఖి కేంద్రం ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. బాధిత మహిళలు, బాలికలు 0870–245112 లేదా టోల్ ఫ్రీ నెంబర్ 181కు ఫోన్ చేయాలని సూచించారు. సఖి కేంద్రం అందించే సేవలపై మహిళలు, యువతులు గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలని కోరారు. ఆపదలో అండగా నిలుస్తోమని భరోసా ఇచ్చారు.

# రోడ్డు డైవర్షన్ పునరుద్ధరణ పూర్తి



కంఠాత్మకూరు బ్రిడ్జి నిర్మాణ పనుల కోసం తాత్కాలికంగా నిర్మించిన వంతెన

నడికూడ : మండలంలోని కంఠాత్మకూరు వాగుపై తాత్కాలికంగా నిర్మించిన వంతన ఇటీవల కురిసిన వర్షానికి కొట్టుకుపోయింది. అప్పటి నుంచి పరకాల–అంబాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కాగా రోడ్డు డైవర్షన్ కోసం సీసీరోడ్డుతో తాత్కాలికంగా వంతనను పునరుద్ధరించినట్లు పరకాల ఆర్అండ్‌బీ డీఈ పి.రాజు తెలిపారు. కాగా గురువారం నుంచి పరకాల, అంబాల, హనమకొండ బస్సులు వయా కంఠాత్మకూర్ నుంచి రాకపోకలు సాగించనున్నట్లు డిపో మేనేజర్ రవి తెలిపారు.

## అటెన్షన్ ప్లీజ్



### ప్రమాదకర గుంతలను పూడ్చండి

నడికూడ : మండల కేంద్రం నుంచి పులిగిల్లకు వెళ్లే ప్రధాన రహదారిపై పెద్ద గుంతలు ఏర్పడడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి గుంతలు పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి పేరు :
నాగరాజు, ఆర్అండ్‌బీ ఏఈ
ఫోన్‌నంబర్ : 8500553553

# నకిలీ మందులు విక్రయిస్తే కఠిన చర్యలు



ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేస్తున్న ఏఓ శ్రీనివాస్

పరకాల : మండలంలోని ఫర్టిలైజర్ షాపుల యజమానులు రైతులు నకిలీ మందులు విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని ఏఓ శ్రీనివాస్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. సోషల్ మీడియాలో కొన్ని కంపెనీల పేరిటా జరుగుతున్న ప్రచారంపై ముందస్తు జాగ్రత్తలు చేపట్టినట్లు చెప్పారు. అనుమానిత దుకాణాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. అన్ని ఫర్టిలైజర్ షాపులు నిబంధనల ప్రకారమే నడుస్తున్నాయని, ఏలాంటి నకిలీ మందులు లభించలేదన్నారు. రైతులు పురుగుమందులు కొనుగోలు చేసేముందు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. రశీదు తప్పకుండా తీసుకోవాలని అన్నారు.

# వాటర్‌ప్లాంట్ మరమ్మతుకు ఆర్థికసాయం



మాట్లాడుతున్న కొయ్యడ భిక్షపతి

వేలేరు : మండలంలోని షోడాషపల్లి గ్రామంలో గల బాలవికాస వాటర్‌ప్లాంట్ కొన్ని నెలల క్రితం మరమ్మతుకు చేరుకుంది. దీంతో గ్రామస్తులు తాగు నీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాటర్ ప్లాంట్ కమిటీ అధ్యక్షుడు కొయ్యడ భిక్షపతి ద్వారా విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త గడ్డి రవి–రేఖ దంపతులు స్పందించారు. ఈ మేరకు రూ.35 వేలు ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా వాటర్ ప్లాంట్ కమిటీ సభ్యులు, గ్రామస్తులు రవి దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ ప్రజల కోసం సాయం అందించడం అభినందించాల్సిన విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో వాటర్‌ప్లాంట్ కమిటీ సభ్యులు శ్రీనివాస్, దశరథం, రవి పాల్గొన్నారు.

### విస్తృత తనిఖీలు

హన్మకొండ : వరంగల్ పోలీసు కమిషనరేట్ డ్రగ్స్ కంట్రోల్ టీం విస్తృతంగా తనిఖీలు నిర్వహించింది. మంగళవారం రైల్వేస్టేషన్, బస్ స్టేషన్‌లు, బస్సుల్లోనూ విస్తృతంగా పోలీసు జాగిలాలతో తనిఖీ చేశారు. ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డ్రగ్స్ కంట్రోల్ టీం అధికారులు, సిబ్బంది తనిఖీలు ముమ్మరం చేశారు. హనుమకొండలోని ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో, బస్సుల్లో ప్రయాణికులను, వెంట తీసుకెళ్తున్న బ్యాగులను తనిఖీ చేశారు. అనుమానస్పదంగా ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించి వదిలేశారు.

## సంక్షిప్తంగా

### కేసు నమోదు

ఆత్మకూరు : మండలంలోని గుడెప్పాడ్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. గుడెప్పాడ్‌కు చెందిన బాబుమియా మద్యం బాటిళ్లను డంప్ చేసి విక్రయిస్తుండగా మంగళవారం పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు తనిఖీ చేసినట్లు చెప్పారు. దీంతో మద్యం లభించగా స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

### ఆలయంలో శ్రమదానం



ఆత్మకూరు : మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో మంగళవారం ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శ్రమదానం నిర్వహించారు. ఆలయ ఆవరణలో పిచ్చిమొక్కలు, చెట్లకొమ్మలు తొలగించారు. ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో వంగాల బుచ్చిరెడ్డి, టింగిలికారి సత్యనారాయణ, ఉప్పునూతుల శంకర్‌జీ, నాగబండి శివప్రసాద్, కందకట్ల విజయ్‌కుమార్, వెల్దె కపిల్, గోపిరెడ్డి మోహన్, సాయిసేన్‌తో పాటు ఆర్ఎస్ఎస్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్ నాయకుల సంబురాలు



శాయంపేట : బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ, మాజీ ఎంపీ కల్వకుంట్ల కవితకు బెయిల్ మంజూరు కావడంపై ఆ పార్టీ నాయకులు మంగళవారం సంబురాలు చేసుకున్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో బాణాసంచా కాల్చి నినాదాలు చేశారు. అనంతరం స్వీట్స్ పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ ప్రసాద్, బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు శివ, భారత జాగృతి రాష్ట్ర నాయకుడు అశోక్, నాయకులు విజయ్‌కుమార్, మోహన్, రమేశ్, ఆదిరెడ్డి, దేవయ్య, వెంకట్ పాల్గొన్నారు.

### గణేశ్ మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

వేలేరు : గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసే మండపాలకు స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి అనుమతి తీసుకోవాలని ఎస్సై సురేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీజే బాక్సులకు అనుమతి లేదని, కరెంట్ సరాఫరాకు విద్యుత్‌శాఖ అనుమతి తీసుకోవాలని సూచించారు. అధిక శబ్దం వచ్చేలా పాటలు, లౌడ్‌స్పీకర్లు అమర్చొద్దని, మండపాలను రోడ్లపై, ఇరుకైన వీధుల్లో ఏర్పాటు చేయొద్దని సూచించారు. పోలీసుల సూచనలు తప్పకుండా పాటించాలని కోరారు.

### జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



దామెర : జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో మండల కేంద్రం సమీపంలోని శ్లోక పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల కరస్పాండెంట్ రాధికాకృష్ణమూర్తి మంగళవారం తెలిపారు. వరంగల్‌లో డీవైఎస్ఓ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు విజేతలుగా నిలిచినట్లు ఆమె పేర్కొన్నారు. కరస్పాండెంట్ రాధికాకృష్ణమూర్తి, ఇంచార్జ్ ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు.

# వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాయిని..

హన్మకొండ: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ హౌజింగ్ బోర్డులో వడ్డేపల్లి పట్టణ ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వైద్య సిబ్బంది వార్డుల్లో పర్యటిస్తూ వైద్యపరీక్షలు చేయాలని సూచించారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని వార్డుల్లో వారానికి రెండు రోజులు వైద్యశిబిరాలు నిర్వహించాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. అనంతరం అధికారులతో కలిసి ఎమ్మెల్యే సుబేదారిలోని అలీపురలోని బడిమజీద్ ప్రాంతంలో పర్యటించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రెయినేజీ, అంతర్గత రోడ్ల నిర్మాణాలు, పేరుకుపోయిన చెత్తాచెదారం పట్ల అసహనం వ్యక్తం చేశారు. ఇల్లు లేదని కొందరు మహిళలు కోరగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వడ్డెపల్లి పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మాలిక, కాంగ్రెస్ నాయకులు సంపత్ యాదవ్, లక్ష్మారెడ్డి, కోన శ్రీకర్, కొండా నాగరాజు పాల్గొన్నారు.

### యెలుగం శ్రీనివాస్ ప్రజానాయకుడు

వరంగల్: మాజీ కార్పొరేటర్, మాజీ కుడా సమన్వయకర్త యెలుగం శ్రీనివాస్ ప్రజానాయకుడు అని, ఆయన లేని కొత్తవాడను ఊహించుకోలేమని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు అన్నారు. శ్రీనివాస్ సోమవారం మృతి చెందగా అంత్యక్రియలు రాత్రి జరిగాయి. విషయం తెలుసుకున్న కొండా మురళీ మంగళవారం కొత్తవాడలోని శ్రీనివాస్ ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శ్రీనివాస్ సతీమణి, కుమారులను పరామర్శించి ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఆయన వెంట మాజీ కార్పొరేటర్ యెలుగం లీలావతి, నాయకులు నవీన్‌రాజు, అయూబ్ ఖాన్, సత్యనారాయణ, రాజేశ్‌తో పాటు తదితరులు ఉన్నారు.

# బాల్య వివాహాలను నిర్మూలించాలి

- ఎంపీడీఓ విజయ్‌కుమార్



తస్మాత్ జాగ్రత్త వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ

ఎల్కతుర్తి : బాల్య వివాహాలను నిర్మూలించాలని ఎంపీడీఓ విజయ్‌కుమార్ అన్నారు. చిన్న వయస్సులోనే వివాహాలు చేయడం వల్ల కలిగే నష్టాలు, తలెత్తే అనారోగ్య సమస్యలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో బచ్ పన్ బచావో ఆందోళన్, కైలాష్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్, ఫేర్ ఎన్‌జీవో రూపొందించిన 'తస్మాత్ జాగ్రత్త' వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. మండలంలో బాల్య వివాహాలు ఎక్కువగా జరిగే గ్రామాలను గుర్తించి వాటి నిర్మూలన కోసం కృషి చేయాలని అన్నారు. ప్రస్తుతం మండలంలో బాల్య వివాహాలు తగ్గినప్పటికీ కొన్ని మారుమూల ప్రాంతాల్లో ఆడపిల్లల తల్లిదండ్రులు అవగాహన రహిత్యంతో చిన్న వయస్సులోనే వివాహాలు జరిపించేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. 12 నుంచి 18 సంవత్సరాల వయస్సు కలిగిన ఆడ పిల్లల వివరాలు సేకరించి అవగాహన కల్పించాలని సూచించారు. కోఆర్డినేటర్ ఇక్బాల్‌పాషా, కౌన్సిలర్ జమున, జగన్, సోషల్ మొబైలైజర్ జ్ఞానేశ్వరి పాల్గొన్నారు.

# వైభవంగా గోకులాష్టమి వేడుకలు

- పురవీధుగుండా స్వామివారి ఊరేగింపు



ఎల్కతుర్తి : స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు



ఆత్మకూరు : ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకుడు

ఎల్కతుర్తి : గోకులాష్టమి వేడుకలను పురస్కరించుకుని మండలంలోని వల్బాపూర్ గ్రామంలో త్రైత్ర సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞానవేదిక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం స్వామివారి శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. మహిళలు కోళలతో భజన సంకీర్తనలు ఆలపించారు. భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారికి నారికేళములు సమర్పించి మంగళహారతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ భావనరుషి, శ్రీనివాస్‌రావు, రవీందర్‌రావు, రాములు, వెంకట్రావు, లక్ష్మణ్‌రావు, చక్రపాణి, రవీందర్ రెడ్డి, బాలు గోపికృష్ణ, కుమారస్వామి, సతీష్‌చారి, శివ, నారాయణ సింగ్, వెంకట్, క్షేత్రజ్ఞరుషి, సాకేత్, తనుషా, దివిజ, స్రవంతి, రాణి, రేవతితో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో మంగళవారం రాత్రి వైష్ణవ సంప్రదాయం ప్రకారం శ్రీకృష్ణజన్మాష్టమి (కణ్ణన్ తిరు నక్షత్ర) వేడుకలు వైభవంగా జరిగాయి. అర్చకుడు ఆరుట్ల మాధవమూర్తి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామికి ప్రత్యేక హారతులు, సేవలు చేశారు. భక్తులు సంకీర్తనలు ఆలపించారు.

# బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కుతోనే కవితకు బెయిల్

- కాంగ్రెస్ హుస్నాబాద్ నియోజకవర్గ నాయకుడు అశోక్‌రెడ్డి

ఎల్కతుర్తి : ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో తిహార్ జైల్లో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు బీఆర్ఎస్ నేతలు బీజేపీ పెద్దలతో కుమ్మక్కై బెయిల్ తీసుకొచ్చారని కాంగ్రెస్ హుస్నాబాద్ నియోజకవర్గ నాయకుడు బొమ్మనపల్లి అశోక్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు కలిసి బీజేపీ పెద్దలతో కుమ్మక్కయ్యారని, దీంతో 163 రోజుల పాటు తిహార్ జైల్లో ఉన్న కవితకు బెయిల్ మంజూరు అయ్యిందని ఆరోపించారు. తరుచూ బీఆర్ఎస్ నేతలు ఢిల్లీకి వెళ్తూ బీజేపీ నేతలను కలిసి ప్రాధేయపడ్డారని, బీఆర్ఎస్‌ను బీజేపీకి తాకట్టు పెట్టి కవితకు బెయిల్ తీసుకొచ్చారని ఘాటు విమర్శలు చేశారు. ఆ రెండు పార్టీలు చీకటి ఒప్పందంతో కాంగ్రెస్‌ను దెబ్బతీయాలని చూస్తున్నాయని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నాయకులు బీజేపీకి ఓట్లు వేయించారన్న విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్ నాయకుల మాయమాటలకు ఆకర్షితులు కావద్దని ప్రజలను కోరారు.

# హనుమాన్ స్వాముల అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

శాయంపేట : శ్రావణమాసం నాలుగో మంగళవారాన్ని పురస్కరించుకుని మండలంలోని మచ్చర్లయ్యగుట్ట వద్ద హనుమాన్ స్వాములు మహాఅన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ముందుగా గణపతి, హనుమాన్, కాలభైరవ విగ్రహాలకు చందనాభిషేకం చేశారు. మచ్చర్లయ్యగుట్టపై వెలసిన మత్స్యగిరిస్వామికి దీపారాధన చేసి పుష్పాలంకరణ నిర్వహించారు. హనుమాన్ స్వాములు భజనలు చేయడం, భక్తి గీతాలు ఆలపించడంతో ఆలయ పరిసరాలు శ్రీరామనామ స్మరణతో మార్మోగింది. అనంతరం మహాఅన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది లెక్కల జలేందర్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ సామల భిక్షపతి, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కందగట్ల కోటేశ్వర్, పత్తిపాక భజన మండలి అధ్యక్షుడు మాందాడి రాజు, హనుమాన్ స్వాములు గిద్దమారి సురేశ్, తట్ల రాజశేఖర్, చల్ల నాగరాజు, ఉప్పు రాజు, నీల రంగారెడ్డి, కురాకుల మొగిలి, భాస్కర్ రెడ్డి, మురారి, అఖిల్, తడక సదానందం, పోలెపల్లి అరవింద్, గజ్జి మహేందర్ పాల్గొన్నారు.

# మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి




అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అనితారెడ్డి

శాయంపేట : మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని సామాజిక కార్యకర్త అనితారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో వీఓఏలకు సమావేశం నిర్వహించగా ఆమె హాజరై మాట్లాడారు. మహిళలు పురుషులతో సమానంగా ఎదిగినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఎంచుకున్న రంగంలో ప్రతి మహిళా ప్రతిభను కనబర్చాలని అన్నారు. గతంలో మహిళలు వివక్షకు గురైయ్యేవారని, కానీ ఇప్పుడు పురుషులతో సమానంగా మహిళలు ఎదుగుతున్నారని అన్నారు. ప్రజ్వల్ రైతు ఉత్పత్తిదారుల సంఘంతో పాటు వివిధ సంస్థలు మహిళలకు అండగా నిలుస్తున్నాయని అన్నారు. సంఘం ఆధ్వర్యంలో వివిధ చిన్నతరహా పరిశ్రమలను ఏర్పాటు చేయడం జరుగుతుందని, ప్రతి మహిళా వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఫణిచంద్ర, ఏపీఓ అనితారెడ్డి, ఏపీఎం శ్రీధర్‌రెడ్డి, వివిధ గ్రామాల వీఓఏలు, మహిళలు, ప్రజ్వల్ క్షేత్ర సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.

### సమస్యలు పరిష్కరించండి

నయీంనగర్: తెలంగాణ మున్సిపల్ కార్మికుల సమస్యలు, డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి ఆధ్వర్యంలో మంగళవారం కుడా కార్యాలయంలో సీడీఎంఏ గౌతమ్‌కు వినతిపత్రం అందజేశారు.